

మంచిర్యాల మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం

అవిశ్వాసం నెగ్గిన అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ కౌన్సిలర్లు

- పదవులు కోల్పోయిన చైర్మన్, వైస్ చైర్మన్లు
- చక్రం తిప్పిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు
- మున్సిపాలిటీలో చరిత్ర తిరగ రాసిన కాంగ్రెస్
- తొలిసారి పదవులకు దూరమైన నేతలుగా రికార్డు

మంచిర్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో నాలుగేళ్లపాటు చైర్మన్, వైస్‌చైర్మన్లుగా పదవులు అలంకరించిన పెంట రాజయ్య, గాజుల ముకేష్‌గౌడ్‌లు మరో సంవత్సరం కాలపరిమితి మిగిలి ఉండగానే పదవులు కోల్పోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా, కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 26 ఉంది. అవిశ్వాసానికి అవసరమైన మ్యాజిక్ ఫిగర్ ఉండటంతో బీఆర్ఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేయాలని గత నెల 15న మెజార్టీ కౌన్సిలర్లు కలెక్టర్ బదావత్ సంతోష్‌కు నోటీసు అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంచిర్యాల ఆర్డీవో రాములు గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బలనిరూపణ చేపట్టారు. ఉదయం చైర్మన్‌పై, మధ్యాహ్నం వైస్ చైర్మన్‌కు బల నిరూపణ సమావేశాలు ఏర్పాటు చేశారు. సమావేశానికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరు కాగా, 26 మంది కాంగ్రెస్ సభ్యులతో పాటు బీజేపీ కౌన్సిలర్ మోతె సుజాత కాంగ్రెస్‌కు మద్దతు తెలపడంతో చైర్మన్, వైస్ చైర్మన్లపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో మున్సిపాలిటీ హస్తగతం అయింది.

క్యాతనపల్లిలోనూ అవిశ్వాస నోటీసు

క్యాతనపల్లి మున్సిపాలిటీలోనూ మెజార్టీ కౌన్సిలర్లు చైర్మన్, వైస్ చైర్మన్లపై కలెక్టర్‌కు ఈనెల 10న నోటీసు అందజేశారు. మున్సి పాలిటీలో మొత్తం 22 వార్డులు ఉండగా, కేవలం ఇద్దరే కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. అయితే ప్రస్తుత బీఆర్ఎస్ చైర్‌పర్సన్ జంగం కళ, వైస్‌చైర్మన్ సాగర్‌రెడ్డికి వ్యతిరేకంగా ఆ పార్టీ కౌన్సిలర్లే అవి శ్వాసం కోరడం గమనార్హం. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లపై కౌన్సిలర్లలో అసంతృప్తి జ్వాలలు ఉండటంతో వారిని పదవీచ్యుతులను చేయడం ద్వారా నూతన నాయకత్వాన్ని ఎన్నుకునే ఎత్తుగడల్లో భాగంగా నోటీసు అందజేశారు.

నూతన చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక లాంఛనమే...

మున్సిపాలిటీలో బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్లు పదవీచ్యుతులు కావడంతో కాంగ్రెస్ సభ్యులు పీఠాలను అలంకరించనున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌ల రాజీనామాలను రాష్ట్ర మున్సిపల్ పరిపాలనశాఖ ఆమోదించిన అనంతరం నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇందుకు దాదాపు వారం, పది రోజులు సమయం పట్టే అవకాశాలున్నాయి. నోటిఫికేషన్ వెలువడగానే చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక జరుగనుంది. మున్సిపల్ చైర్మన్‌గా 30వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్‌గా 2వ వార్డు కౌన్సిలర్ నల్ల మహేష్‌లు ఎన్నికయ్యే అవకాశం ఉంది.

పదవులు కోల్పోయిన నేతలుగా రికార్డు

కాంగ్రెస్ కౌన్సిలర్ల అవిశ్వాసానికి గురై పదవులు కోల్పోయిన నేతలుగా చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ గాజుల ముకేష్‌గౌడ్‌లు రికార్డుల్లోకి ఎక్కారు. మొదటి సారిగా 1956లో మంచిర్యాల మున్సిపాలిటీగా ఏర్పాటు అయింది. ఆనాటి నుంచి నేటి వరకు 59 సంవత్సరాల్లో పలు మార్లు చైర్మన్ ఎన్నికలు ప్రత్యక్షంగా, పరోక్షంగానూ ఎన్నికయ్యారు. పాలకవర్గం పదవి కాలం ముగిసిన సందర్భంలో ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేకాధికారి పాలన ఏర్పాటు చేశారే తప్ప ఏనాడూ అర్ధంతరంగా చైర్మన్, వైస్ చైర్మన్లు పదవు లను కోల్పోయిన సందర్భాలు లేవు.

చక్రం తిప్పిన పీఎస్సార్

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రేంసాగర్‌రావు గెలిచిన తరువాత మున్సిపాలిటీలో భారీ మార్పులు జరిగాయి. బీఆర్ఎస్‌కు చెందిన 16 మంది కౌన్సిలర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. 2018 అసెం బ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు గెలుపొందడంతో అప్పుడు కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన ఆరుగురు కౌన్సిలర్లు ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్ల ఎన్నికకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం ప్రేంసాగర్‌రావు ఎమ్మెల్యేగా గెలవడంతో నియోజకవర్గంలోని మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. మూడు మున్సి పాలిటీల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాలకు తెరలేపారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

స్వచ్ఛ సర్వేక్షన్‌లో 12వ ర్యాంక్

నస్పూర్, జనవరి 11 : కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షన్-2023లో భాగంగా సౌత్ జోన్‌లో నస్పూర్ మున్సిపాలిటీకి 12వ ర్యాంక్ సాధించిందని కమిషనర్ తన్నీరు రమేష్ తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, ఆరుబయట మలమూత్ర విసర్జన నియంత్రణ, మరుగుదొడ్ల నిర్వహణ తదితర విభాగాల్లో సాధించిన ప్రగతికి ర్యాంక్ వచ్చిందన్నారు. ర్యాంక్ సాధించడానికి కృషి చేసిన సిబ్బందికి, పట్టణ వాసులకు కమిషనర్ ధన్యవాదాలు తెలిపారు.

14 నుంచి వాలీబాల్ టోర్నమెంట్

నెన్నెల, జనవరి 11: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 14 నుంచి కోనంపేటలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు యూత్ కమిటీ సభ్యులు సునార్కారి శంకర్, కొడిపె రాజేష్ తెలిపారు. విన్నర్ జట్టుకు రూ.5 వేలు, రన్నర్ జట్టుకు రూ.3,500లు ప్రైజ్ మనీతో పాటు షీల్డ్ అందజేస్తామన్నారు. టోర్నమెంట్‌లో ఆడాలనుకునే జట్లు పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 7780752260, 9014191253 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దీపాదాస్‌ను కలిసిన రాధిక



దీపాదాస్‌ను సన్మానిస్తున్న రాధిక

మందమర్రి టౌన్, జనవరి 11 : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని గురువారం తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల సంయుక్త కార్యదర్శి రాధిక మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం, పీఈటీ

నెన్నెల, జనవరి 11: రాష్ట్ర స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలకు మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి గంట వైష్ణవి ఎంపికైందని హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పీఈటీ సాంబమూర్తి తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంలో గురువారం నిర్వహించిన జోనల్ స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. జనవరి 16 నుంచి 18 వరకు జనగామలో నిర్వహించే రాష్ట్ర పోటీల్లో జిల్లా జట్టుకు వైష్ణవి ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు.

భూముల సమస్యలను పరిష్కరించాలి

భీమిని, జనవరి 11 : మండలంలోని తంగళ్లపల్లిలోని భూముల సమస్యలను పరిష్కరించాలని రైతులు గురువారం ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. 2017లో సమగ్ర భూసర్వేలో మాకు న్యాయం జరగలేదని, అప్పటి ప్రభుత్వం పాసుపుస్తకాలు ఇవ్వలేదని తెలిపారు. 2022 మే, జూన్ నెలలో ప్రభుత్వం జాయింట్ సర్వే చేసినా ఇప్పటివరకు హక్కు పత్రాలు ఇవ్వలేదన్నారు. సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవోను కోరారు. ఇందూరి శ్రీనివాస్, నాగేందర్, అన్నం శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ల విడుదల

భీమిని, జనవరి 11: భీమిని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్లను హెచ్‌ఎం వెంకటస్వామి విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి వరప్రసాద్, మండల అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి జీవన్, కార్యదర్శి చంద్రశేఖర్, విక్రమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడెక్కిన రాజకీయాలు

- నేడు నస్పూర్, బెల్లంపల్లి మున్సిపల్ అవిశ్వాస సమావేశాలు
- బెల్లంపల్లిలో 18 మంది కౌన్సిలర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా

బెల్లంపల్లి, జనవరి 11: బెల్లంపల్లి మున్సిపాలిటీ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్‌చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై అవిశ్వాసం ప్రకటించి బీఆర్ఎస్ కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లిన విషయం తెలిసిందే. అవిశ్వాసంపై సమావేశం నిర్వహించాలని గత నెల 7న కలెక్టర్‌కు తీర్మానపత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం క్యాంపులో ఉన్న 18 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు రాజీనామా చేయడంతో ఒక్కసారిగా రాజకీయ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత 12 మంది కౌన్సిలర్లతో క్యాంపునకు వెళ్లారు. నేడు నిర్వహించనున్న అవిశ్వాస తీర్మానంలో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కౌన్సిలర్లందరు ఎవరి వైపు నిలుస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

బీఆర్ఎస్‌కు షాక్

బెల్లంపల్లి మున్సిపాలిటీలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా తారుమారయ్యాయి. బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు 18 మంది పార్టీకి రాజీనామా చేయడం రాజకీయంగా కలకలం రేపింది. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను పట్టించుకోవడం లేదని, చిన్నయ్య చేస్తున్న పనులకు విసుగు చెంది పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేతకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చేస్తున్నటు వంటి అవిశ్వాస రాజకీయాలతో విసుగు చెంది రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోకపోవడంతో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా చేసిన వారిలో కౌన్సిలర్లు నెల్లి శ్రీలత, తడక పద్మావతి, బడికెల కమల, ఎలిగేటి సుజాత, చిట్యాల శ్రీలక్ష్మీ, పోతురాజుల లీల, భరద్వాజ్, సముద్రాల లావణ్య, జిలకర తార, గురుండ్ల లక్ష్మీ, కొక్కు చంద్రశేఖర్, అఫ్సర్, గోసిక రమేష్, దామెర శ్రీనివాస్,సుజాత, గడ్డం అశోక్‌గౌడ్, పోలు ఉమాదేవి, షేక్ ఆస్మాలు ఉన్నారు. కౌన్సిలర్లందరు మూకుమ్మడి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.



కౌన్సిల్ హాల్‌లో ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఆర్డీవో

నస్పూర్‌లో...

నస్పూర్: నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై అవిశ్వాసానికి అంతా సిద్ధమైంది. చైర్మన్‌పై అసంతృప్తితో కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌కు మెజార్టీ కౌన్సిలర్ల సంఖ్య పెరగడంతో చైర్మన్‌పై అవిశ్వాసం నోటీస్‌ను కలెక్టర్‌కు ఇచ్చారు. మంచిర్యాల ఆర్డీవో రాములు శుక్రవారం మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో అవిశ్వాసంపై సమావేశం జరుగనుంది. నస్పూర్ మున్సిపాటీలో 25 వార్డులుండగా బీఆర్ఎస్-10, కాంగ్రెస్-6, బీజేపీ-3, సీపీఐ-2, నలుగురు స్వతంత్రులు కౌన్సిలర్లుగా విజయం సాధించారు. నలుగురు స్వతంత్రులు బీఆర్ఎస్‌లో చేరడం, సీపీఐ ఇద్దరు సభ్యుల మద్దతుతో చైర్మన్‌గా ప్రభాకర్, వైస్ చైర్మన్‌గా తోట శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడంతో అనూహ్య మార్పులు చోటు చేసుకున్నాయి. బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడం, మిత్రపక్షం సీపీఐ ఇద్దరు సభ్యుల మద్దతుతో 19కి చేరింది. ఇన్నాళ్ళు వైస్‌చైర్మన్‌గా కొనసాగిన తోట శ్రీనివాస్ పదవికి ఇది వరకే రాజీనామా చేశారు. కాంగ్రెస్ సభ్యులు ప్రస్తుతం హైదరాబాద్ శిబిరంలో ఉండగా నేరుగా సమావేశానికి హాజరు కానున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో

నస్పూర్ మున్సిపాలిటీ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే అవిశ్వాస సమావేశం ఏర్పాట్లను మంచిర్యాల ఆర్డీవో, ప్రిసైడింగ్ అధికారి రాములు పరిశీలించారు. ఏర్పాట్లపై సూచనలు, సలహాలను ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ తన్నీరురమేష్ సిబ్బంది ఉన్నారు.

సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 11: జిల్లాలో గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రాథమిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి ప్రక్రియను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని, అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పారిశుధ్యం, పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ప్రాథమిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జడ్పీ సీఈవో నరేందర్,డీఆర్‌డీవో శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పాల్గొన్నారు.

రేపు సైకిల్ రేస్ పోటీలు

హాజీపూర్, జనవరి 11: హాజీపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 13న జిల్లా స్థాయి సైకిల్ రేస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బుగ్గ గట్టు సమీపంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ 17 విభాగంలో 9, 10 తరగతుల విద్యార్థులకు, అండర్ 14లో 7,8 తరగతులు, అండర్ 12లో 5, 6 తరగతులు, అండర్ 10లో 3,4 తరగతులు, అండర్ 8లో 1, 2 తరగతులు చదివే విద్యార్థులు పాల్గొనాలని తెలిపారు. ఎవరి సైకిళ్లు వారే తెచ్చుకోవాలని, ప్రతీ విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు ఉంటాయని తెలిపారు. పాల్గొనే వారు శనివారం 10 గంటలకు 9908074636లో సంప్రదించాలన్నారు.

నియామకం

హాజీపూర్, జనవరి 11: దళిత వికాస సమితి పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జిగా ముల్కల్ల గ్రామానికి చెందిన చెగ్యాము శ్రీనివాస్ నియమితులయ్యారు. గురువారం ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధార్ధ నియామక పత్రం అందించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే పీఎస్సార్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 11: నియోజకవర్గంలో మున్సిపాలిటీలు, అన్ని మండలాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫ్లైవోవర్ బ్రిడ్జిపై రూ.15 లక్షలతో మరమ్మతు చేయించామన్నారు. ఐబీ చౌరస్తాలో గల ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ స్థలంలో మాతా శిశు ఆసుపత్రి నిర్మించనున్నట్టు వెల్లడించారు. ఆ స్థలంలో గత నాయకులు అనాలోచితంగా మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం చేశారని విమర్శించారు. సీఎంతో మాట్లాడి అనుమతి తీసుకుంటామన్నారు. అదనంగా మరో 300 పడకల ఆసుపత్రిని నిర్మిస్తామన్నారు. తిలక్‌నగర్, ఏసీసీ, గోదావరి రోడ్డు, సాయికుంటల్లో గల శ్మశాన వాటికలను నిర్మిస్తామన్నారు. గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు సరఫరా చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీల్లో స్వచ్ఛమైన తాగు నీరు సరఫరా చేసేందుకు, డంప్ యార్డ్ సమస్యను పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. లక్షెట్టిపేటలో తాను చదువుకున్న ప్రభుత్వ పాఠశాల భవనం మరమ్మతుకు నిధులు మంజూరు చేశామన్నారు. నస్పూరులో అక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంచిపెడతామన్నారు. రేషన్‌కార్డుల పంపిణీ, రూ. 500లకు వంటగ్యాస్ పథకం అమలు చేస్తామన్నారు. రూ. 10 కోట్లు విడుదల చేసి నియోజకవర్గంలో కుల సంఘాల భవనాలకు తాగు నీటి సమస్య పరిష్కరించేందుకు కేటాయించినట్టు తెలిపారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం కోసం సహకరించిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్లు రావుల ఉప్పలయ్య, నల్ల మహేష్, సంజీవ్ నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

కలెక్టరేట్ ఎదుట హాస్టల్ కాంట్రాక్టు కార్మికుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న హాస్టల్స్ కాంట్రాక్టు కార్మికులు

నస్పూర్, జనవరి 11: జిల్లాలోని ఎనిమిది పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు అందజేశారు. ఐఎఫ్‌టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం మాట్లాడుతూ పోస్ట్‌మెట్రిక్ హాస్టల్స్‌లో ఎనిమిది సంవత్సరాలుగా పని చేస్తున్న 50 మంది కుక్స్, అసిస్టెంట్ కుక్స్, డే, నైట్ వాచ్‌మన్, స్వీపర్, స్కావెంజర్స్ విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్కువ వేతనాలను కోడ్ చేసిన ఏజెన్సీలకు టెండర్ అప్పగిస్తున్నారు. దీంతో వేతనాలు తగ్గుతున్నాయని, కుటుంబాల పోషణ భారంగా మారిందన్నారు. కనీస వేతనాలను అమలు చేయకపోతే ఈ నెల 27 నుంచి సమ్మెలోకి వెళతామని నాయకులు తెలిపారు. వెంకటేశ్, కృష్ణ, రాజేశ్వరీ, జజ్యోతి, లక్ష్మి, వినీత్, ప్రసాద్, శాంత, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న జీఎం సంజీవరెడ్డి

నస్పూర్, జనవరి 11: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. రేడియంట్ పాఠశాల వార్షిక క్రీడోత్సవాలను నాగార్జున కాలనీ మైదానంలో గురువారం జీఎం జ్యోతి ప్రజ్వలన, మంచిర్యాల ట్రాఫిక్ సీఐ నరేష్, ఎస్సై రవికుమార్ జవాన్, కిసాన్ జెండాలను ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, వాలీబాల్, క్రికెట్, మార్చ్ ఫాస్ట్, మాస్ డ్రిల్, యోగా, కరాటే పోటీలు జరిగాయి. ఆయా క్రీడల్లో ప్రతిభను ప్రదర్శించిన క్రీడాకారులకు అతిథులు బహుమతులు అందజేశారు. జీఎం మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం, శరీరధారుఢ్యానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్స్ చెన్నూరి అఖిల, అమన్ ప్రసాద్, ట్రస్మా నాయకులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

హిట్‌అండ్‌రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన



బెల్లంపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న లారీ డ్రైవర్లు

బెల్లంపల్లి, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన హిట్‌అండ్‌రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ గురువారం కన్నాల ఫ్లైఓవర్ వద్ద లారీ ఓనర్స్, డ్రైవర్లు లారీలను నిలిపివేసి ఆందోళన చేపట్టారు. డ్రైవర్లు వహీద్, షెంశుద్దీన్, అజయ్, భద్రు, ముజ్జులు మాట్లాడుతూ హిట్‌అండ్‌రన్ చట్టం ద్వారా పొరపాటున జరిగిన ప్రమాదానికి రూ.7 లక్షల జరిమానా, 10 సంవత్సరాల జైలు శిక్ష విధించడం సరైంది కాదన్నారు. డ్రైవర్లు వాహనాలను నిలిపివేస్తే ప్రభుత్వానికి, ప్రజలకు పరోక్షంగా నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

యాదవులు ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి



మాట్లాడుతున్న బండి సదానందం యాదవ్

మందమర్రి టౌన్, జనవరి 11: యాదవులు ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధిస్తామని అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. గురువారం ఇందూ గార్డెన్‌లో నిర్వహించిన జిల్లా యాదవ సంఘం కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. యాదవులు పార్టీల అభివృద్ధికి పాటుపడుతున్నారే తప్ప పదవులు పొందడం లేదన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో యాదవులు రాజకీయ అణచివేతకు గురయ్యారని పేర్కొన్నారు. సొసైటీలో గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించి గొర్రెల పంపిణీ లేక ఇబ్బందులు పడ్డారని, వాటి వివరాలను సేకరిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి యాదవుల సమస్యలను తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. యాదవ సంఘం క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. అంతకు ముందు శ్రీకృష్ణుని చిత్రపటానికి పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కుమారస్వామి, కొంతల మల్లేష్, బొట్ల రాజేష్ యాదవ్, అల్లంల సత్తన్న, గాదవేని సత్తన్న, జక్కుల రాజన్న, బండి రవి, నర్సన్న, ప్రవీణ్, పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా చూడాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

చెన్నూరు, జనవరి 11: పీహెచ్‌సీలో ప్రసవాలు జరిగేలా చూడాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు సూచించారు. గురువారం అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీని పరిశీలించారు. ముందుగా ఓపీ రిజిష్టర్, మందులను తనిఖీచేశారు. అనంతరం ఏఎన్‌ఎంలకు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బుధ, శనివారాల్లో గర్భిణీలకు, చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలను తప్పకుండా వేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని, గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకొంటామన్నారు. పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణతేజ, హెచ్‌ఈవో జగదీష్ , సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలి



ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో

దండేపల్లి, జనవరి 11: ప్రజాపాలనలో చేసుకొన్న దరఖాస్తులను పకడ్బందీగా ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీవో వేముల మల్లేషంలు సూచించారు. గురువారం ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. గత నెల 28 నుంచి ఈనెల 6 వరకు మండలంలోని 31 గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించారు. మండలంలో 16928 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్ డాటా ఎంట్రీ తీరును పరిశీలిస్తున్నారు.







చట్టసభల్లో బీసీల వాటా కోసం మహా పాదయాత్ర



మాట్లాడుతున్న ఆలిండియా ఓబీసీ ఐకాస చైర్మన్ నరేందర్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 11: చట్టసభల్లో బీసీల వాటా కోసం మహా పాదయాత్రకు సిద్ధంగా ఉండాలని ఆలిండియా ఓబీసీ ఐకాస చైర్మన్ సాయిని నరేందర్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీసీ మహాపాదయాత్ర సన్నాకసమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ పదేండ్లుగా అధికారంలో ఉన్నా బీసీల కోసం ఏమి చేయలేదన్నారు. సంఘం వ్యవస్థాపకుడు నరేందర్‌గౌడ్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడుసిద్దేశ్వర్లు, నాయకులుపాల్గొన్నారు.

ఇగ్నైట్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏసీసీ, జనవరి 11: మంచిర్యాల సాంఘికసంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఇగ్నైట్ కాంపిటేషన్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. థిమాటిక్ పెయింటింగ్‌లో పదోతరగతి చదువుతున్న అరుణ్ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రూ.10వేల నగదు, ప్రశంసా పత్రం, ఎలక్యూషన్ తెలుగుభాషలో అరుణ్‌కుమార్ తృతీయ స్థానంలోనిలిచి రూ.5వేలు, ప్రశంసా పత్రం అందుకున్నట్లు తెలిపారు.

మహిళల రక్షణ కోసమే వనితావాక్కు

ఏసీసీ, జనవరి 11:ఆడపిల్లలు, మహిళలరక్షణ కోసమే వనితా వాక్కు ఫౌండేషన్‌స్థాపించినట్లు సంస్థ ఫౌండర్, అడ్వకేట్, సైకాలజిస్టు రంగు వేణుకుమార్ తెలిపారు. గురువారం వికాస తరంగిణి భవన్‌లో క్యాలెండర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలు, మహిళల పట్ల జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రజల్లో మంచి మార్పు వచ్చే దిశగా కృషి చేస్తున్నామన్నారు. చంద్రమోహన్‌గౌడ్, జగన్, మోటూరి కిరణ్, ముకేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం

వేమనపల్లి, జనవరి 11: ముక్కిడిగూడెంలో గురువారం పీహెచ్‌సీ వైద్యుడు రాజేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరంతో ఉన్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యుడు మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గర్భిణీలు క్రమం తప్పకుండా ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయిం చుకోవాలని సూచించారు. సీహెచ్‌వో రాజరెడ్డి, హెల్త్‌అసిస్టెంట్ లింగయ్య, ఏఎన్ఎంలు రాజేశ్వరి, రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్త సరిత పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలి

బెజ్జూరు, జనవరి 11: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరుగ్యారెంటీ పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా చూడాలని కాంగ్రెస్‌పార్టీ సిర్పూర్ తాలూకా ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు పథకాలన్నింటిని పేదప్రజలకు అందేలా చూడాలని సూచిం చారు. కార్యక్రమంలో సిర్పూర్ బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, శంకర్, హకీం, హనుమంతు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలు కుల ధ్రువపత్రం సమర్పించాలి

సిర్పూర్(టి), జనవరి 11: ఎస్సీ, ఎస్టీ విద్యుత్ విని యోగదారులు తమ కుల ధ్రువపత్రంను విద్యుత్‌శాఖ కార్యాలయంలో సమర్పించాలని ఏఈ ఇర్ఫాన్ అహ్మద్ పేర్కొన్నారు. విద్యుత్‌మీటర్, బిల్లు తదితర వివరాలు జతపర్చాలన్నారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ వినియోగ దారులు వినియోగించుకోవాలన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో భీం దేవుడికి పూజలు

సిర్పూర్(యు), జనవరి 11: మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో భీం దేవుడికి పూజలు కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని బోటెజాల గ్రామానికి చెందిన గిరిజనులు భీం దేవుడికి జలాభిషేకం చేశారు. మండలకేంద్రంలోని ఖాతీగూడ, చప్రి, శెట్టిహడ్డునూర్, రుద్రకస, పవర్‌గూడ తదితర గ్రామాల ఆదివాసీలు భీం దేవుడికి ఉత్సవాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళా కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి

మందమర్రి టౌన్, జనవరి 11: ఏరియాలోని జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు సౌకర్యాలను కల్పించాలని కోరుతూ గురువారం గుర్తింపు సంఘం నాయకులు జీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా బ్రాంచికార్యదర్శి సలేంద్రసత్యనారాయణ మాట్లాడుతూ వారికి తాగునీరు, టాయి లెట్స్, రెస్టుహాల్స్ లాంటి సౌకర్యాలు ఏర్పాటుచేయాలని విన్నవిం చారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.



సంక్రాంతి సందడి షురూ

● ఇంటింటా పిండి వంటల ఘుమఘుమలు



నోరూరిస్తున్న పిండి వంటలు



తల్లిదండ్రులతో కలిసి ఇంటికి వెళ్తున్న విద్యార్థినులు



మోడల్ స్కూల్‌లో రంగవల్లులు వేస్తున్న విద్యార్థినులు

దండేపల్లి, జనవరి 11: సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఏ ఇంట్లో చూసినా పిండి వంటలు ఘుమఘుమలే కనిపిస్తుంటాయి. పండుగ కోసం వారం రోజుల ముందు నుంచే ఇండ్లలో పిండి వంటకాల తయారు జోరందుకుంది. దీంతో మహిళలు బిజీ అయ్యారు. సకినాలు, గారెలు, అరిసెలు చేసేందుకు ఒకరి ఒకరు సాయం చేసుకుంటున్నారు. పండగ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పిండి వంటలు ఆరగిస్తూ సంతోషంగా గడుపుతారు. జిల్లా కేంద్రంతోపాటు ఏ గ్రామంలో చూసినా పిండి వంటల ఘుమఘుమలు అందరి నాలుకలకు రుచుల ఆనందాన్ని పంచుతున్నాయి. సంక్రాంతి పిండి వంటకాల్లో సకినాలతో పాటు గారెలు, కారపూస, చేస్తారు. బియ్యం పిండి కోసం ఎక్కడ చూసినా గిర్నీల వద్ద సందడి ఉంటోంది. శనగ, పెసర, చెక్కెరను కూడా పట్టించుకుంటున్నారు. దీంతో గిర్నీల వద్ద రద్దీ నెలకొంది.

● చుక్కలు చూపుతున్న ధరలు...

పిండి వంటకాలలో ఉపయోగపడే ముడి వస్తువుల ధరలు చుక్కలను చూపుతున్నాయి. ఈ యేడు ధరలు పెరిగిపోయాయి. ఐదు కిలోల పిండివంటలు చేసుకోవాలంటే రెండు వేల నుంచి 2500 రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. నువ్వులు కిలోకు 220, శనగపప్పు 90, పల్లీలు 130, శనగపిండి 100 , రిఫైండ్ ఆయిల్ ప్యాకెట్ 110, పల్లినూనె 160 రూపాయలు పలుకుతోంది.

పాఠశాలలకు సెలవులు

రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి పండగకు ఈనెల 12 నుంచి 17 వరకు 6రోజులు పాటు సెలవులు ఇవ్వడంతో గురువారం మధ్యాహ్నం నుంచే విద్యార్థులు ఇంటిబాట పట్టారు. విద్యార్థులకు సంకాంత్రి పండుగకు సెలవు ఇవ్వడంతోనే విద్యార్థులు ఆనందంతో ఇండ్లకు బయలుదేరారు.

స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలు

నెన్నెల: మండల కేంద్రంలోని లోటస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మూడు రోజుల పెద్ద పండుగ ప్రాశస్త్యం, మన సంస్కృతి, సంప్రదాయల గుర్చి పిల్లలకు వివరించారు. కరస్పాండెంట్ మద్దెర్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కొండపర్తి వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏసీసీ: జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థినీలు ముగ్గులు వేశారు. విద్యార్థులు గాలి పటాలను ఎగురవేశారు. భోగి మంటలు, హరిదాసుల వేషధారణతో అలరించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, పీఈటీ రాజేందర్, చైర్మన్ శ్రీధర్,డైరెక్టర్లు పాల్గొన్నారు.

కోటపల్లి: మోడల్ స్కూల్, పారెపెల్లిలో విద్యార్థినీలు రంగవల్లులు తీర్చిదిద్దారు. బావనపల్లిలో హరిదాసుల వేషధారణ, భోగి మంటలు అలరించాయి. కేజీబీవీ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా పిండి వంటలు భోగి సంబరాలు జరిపారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి,పారుపెల్లి,బావనపల్లి హెచ్‌ఎంలు గుండేటి యోగేశ్వర్, బుచ్చన్న, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాజీపూర్: దొనబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థినీలు అందమైన రంగవల్లులు వేశారు. విద్యార్థులకు గాలిపటాలు ఎగురవేసే పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయుడు హన్మాండ్లు, ఎస్‌ఎంసీ చైర్మన్ సత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్: ఆర్‌బీహెచ్‌వీ పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినీలు అందమైన ముగ్గులు వేసి అలరించారు. ప్రిన్సిపల్ స్వరూప, టీచర్స్ రీనారాణిదాస్, పీఈటీలు పాల్గొన్నారు.

జన్నారం: జన్నారంలోని స్లేట్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థినీలు ముగ్గులు వేసి అలరించారు. భోగి మంటలను వేశారు. రైతులు అల్లం లచ్చన్న, దాముక రాజరత్నం, దుమల్ల చంటయ్యలను పాఠశాలకు ఆహ్వానించి సన్మానించారు. కరెస్పాండెంట్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, వ్యవస్థాపకులు ఏనుగు సుభాష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పూజ, అడ్మినిస్ట్రేటర్ ఏనుగు రజిత, ఉపాధ్యాయులు కృష్ణ, సృజన, జోహా,చంద్రమోహన్,దిలీప్, జాకీర్, కార్తీక్ పాల్గొన్నారు.

రామగుండం పోలీస్ కమిషనర్ బదిలీ నిలిపివేత

కోల్‌సిటీ, జనవరి 11: రామగుండం పోలీస్ కమిషనర్ రెమ రాజేశ్వరి బదిలీని ప్రభుత్వం నిలిపివేసినట్టు తెలుస్తున్నది. రామగుండం పోలీస్ కమిషనర్ రెమ రాజేశ్వరి ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు డీఐజీగా బదిలీ అయ్యారు. రామగుండం కమిషనర్‌గా జోన్-7 జోగులాంబ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఈ నెల 3వ తేదిన జీఓ వెలువడింది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రెమ రాజేశ్వరి బదిలీని ప్రభుత్వం నిలిపివేసినట్టు సమాచారం. జోగులాంబ డీఐజీగా ఉన్న చౌహాన్‌కు కూడా విధుల నుంచి రిలీవ్ కాలేదు. ఆమెనే మరికొన్నాళ్ల కొనసాగించాలని భావిస్తున్నట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సమర్థవంతంగా పని చేయడం, లా అండ్ ఆర్డర్ విషయంలో కూడా పూర్తిస్థాయిలో పట్టు ఉండడంతో ఆమెను కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలుస్తుంది.

ఊర్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఏసీసీ, జనవరి 11 : సంక్రాంతి పండగ సెలవుల సందర్భంగా ఊళ్ళకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఊరికి వెళ్లాల్సి వస్తే బంగారు, వెండి ఆభరణాలు, నగదు బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని సూచించారు. ఇంటి ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. తాళం వేసి వెళితే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

పట్టపగలే దొంగతనం

హాజీపూర్, జనవరి 11: రాపల్లి గ్రామంలో గురువారం జాతీయ రహదారిని అనుకుని ఉన్న గుండ ఐలయ్య ఇంట్లో పట్టపగలే దొంగలు పడ్డారు. ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి ఉదయం వ్యవసాయ పనులకు వెళ్ళి సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, లక్ష రూపాయల నగదు, పది తులాల వెండి గొలుసులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులకు సమాచారం అందించానని తెలిపారు.

ఎమ్మెల్యే దృష్టికి నక్కలపల్లి సమస్యలు

కోటపల్లి, జనవరి 11: చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని మండలంలోని నక్కలపల్లి గ్రామస్తులు హైద్రాబాద్‌లో గురువారం కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో రోడ్డు, వాగుపై బ్రిడ్జిల నిర్మాణం, తాగునీరు, తదితర సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. సుమారు 60 మంది ప్రత్యేక బస్సులో హైద్రాబాద్ చేరుకుని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని నాయకులు తోట అశోక్, శ్రావణ్‌రెడ్డి తెలిపారు.

హైవే అలైన్‌మెంట్ మార్చాలి

హాజీపూర్, జనవరి 11: గ్రీన్‌ఫీల్డ్ హైవే అలైన్‌మెంట్ మార్చాలని గురువారం ముల్కల్ల రైతులు కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందించారు. అధికారులు సర్వేలు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని, గ్రీన్‌ఫీల్డ్ హైవేను పొలాల మీదుగా కాకుండా జాతీయ రహదారి వెంబడి విస్తరణ చేయాలని కోరారు. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రోడ్డు విస్తరణ చేపట్టాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వం

మందమర్రి టౌన్, జనవరి 11 : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గడ్డం వంశీవివేక్ తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నెలలోనే ప్రజాపాలన ప్రవేశపెట్టి సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసిందని తెలిపారు. ప్రజల్లో ఆదరణ కోల్పోయిన బీఆర్ఎస్ తమను విమర్శించే పనిగా ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌దే విజయం అని పేర్కొన్నారు. పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు గడ్డం రజిని, నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 11: స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంచిర్యాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 20 మంది యువకులు రక్తదానం చేశారు. హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ద్వారా జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్, ప్రగతి జూనియర్ కళాశాలల విద్యార్థులకు వివేకానంద జీవిత చరిత్రపై అవగాహన కల్పించారు. లయన్ మధుసూదన్‌రెడ్డి, క్లబ్ సభ్యులు సుగుణాకర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బాలాజీ, మహేందర్, భాస్కర్‌రెడ్డి, మాధవి, వేణు, ప్రేంకుమార్, కళాశాల ప్రిన్సిపాల్‌లు శ్రావణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

మైనార్టీల కోసమే రామ మందిరం ప్రారంభానికి కాంగ్రెస్ గైర్హాజరు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

ఏసీసీ, జనవరి 11 : మైనార్టీల ఓట్ల కోసమే అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ గైర్హాజరు అవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందల ఏండ్ల హిందువుల కల అయిన రామ మందిర నిర్మాణం సాకారం అవుతున్న తరుణంలో ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందినప్పటికీ కాంగ్రెస్ అగ్ర నాయకులు రావడానికి నిరాకరించడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఈ నెల 22న ప్రారంభోత్సవం సందర్భంగా రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్టు దేశంలో ఉన్న ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులకు ఆహ్వానాలు పంపిందన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు రామ మందిర ప్రారంభోత్సవాన్ని వ్యతిరేకిస్తున్నారో, సమర్థిస్తున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి రాముని పూజిత అక్షింతలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఆంజనేయులు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన

రామకృష్ణాపూర్, జనవరి 11 : ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై రామకృష్ణాపూర్ పోలీసులు గురువారం క్రైస్ట్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏసీపీ సదయ్య, మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఓటీపీలు, క్రెడిట్, డెబిట్ కార్డుల నంబర్లు తెలియజేయవద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా మోసపోయినట్లయితే సైబర్‌క్రైమ్ సైట్‌తో పాటు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ట్రాఫిక్ నియమాలు, నిబంధనల గురించి తెలియజేశారు. ఆయా విషయాలను కుటుంబ సభ్యులతో పాటుగా సమీపంలోని కుటుంబాల వారికి వివరించాలని విద్యార్థులను కోరారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సభ్యత్వం కోసం భారీ ముడుపులు

● కిందిస్థాయి నాయకులను ప్రలోభపెట్టి గెలిచిన ఏఐటీయూసీ

● మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎన్నికల సందర్భంగా ఐఎన్‌టీయూసీ సభ్యత్వం కోసం ఆ సంఘం నేత జనక్ ప్రసాద్‌కు భారీగా ముడుపులు అందాయని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ ఏరియా కమిటీ కార్యదర్శి ప్రభాత్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన టీబీజీకేఎస్ నాయకుడు సురేందర్‌రెడ్డి రూ.30 లక్షలు ముడుపులు అందజేయగా, మరికొన్ని ఏరియాలలో కూడా యూనియన్‌లో చేర్చుకోవడానికి జనక్‌ప్రసాద్ పెద్ద మొత్తంలో ముడుపులు అందుకున్నాడని ఆరోపించారు. ఏఐటీయూసీ ముఖ్య నాయకుడు వాసిరెడ్డి సీతారామయ్య టీబీజీకేఎస్ ఏరియా నాయకులు, ఫిట్ స్థాయి నాయకులకు లక్షలాది రూపాయలు ఇచ్చి కుమ్మక్కై, కార్మికులను ప్రలోభ పెట్టాడని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల పరోక్ష మద్దతును పొందిన ఏఐటీయూసీ ఆర్జీ -1, 2 నుంచి శ్రీరాంపూర్, మందమర్రి, గోలేటి వరకు ఓట్లు దండుకుందని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సింగరేణి సంస్థను అదాని గ్రూప్ ఆఫ్ కంపెనీగా మార్చే కుట్రపూరిత చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఎంపీల మద్దతుతో పార్లమెంటులో కార్మిక చట్టాల రద్దు, కుదింపుతో పెట్టుబడిదారులకు అనుకూలంగా బొగ్గు సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస)తో కలిసి కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. కార్మికులు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలలో జరుగుతున్న అవకాశవాద, మోసపూరిత పరిణామాలను గ్రహించాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

కన్నెపల్లి, జనవరి 11 : తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో లింగాలచింతపూడిలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కల్పించారు. పొదుపు, బీమా పథకాలు, డిపాజిట్‌లు, రుణాలు, ఆన్‌లైన్ చెల్లింపులు తదితర వాటిపై గ్రామస్తులకు వివరించారు. బ్యాంకు మేనేజర్ శ్రావణ్‌కుమార్, క్యాషియర్ వినయ్, సీఎస్‌పీ మారుతి ప్రజలు పాల్గొన్నారు.

అటవీశాఖ కార్యాలయం ఎదుట.. ఆదివాసీల ఆందోళన

● పులుల మృతికి కారణమంటూ పశువుల కాపర్లను తీసుకెళ్లిన అటవీ అధికారులు
● ఆదివాసీల ధర్నా
● మద్దతు ప్రకటించిన ఆదివాసీ నేతలు
● చివరకు వదిలిపెట్టిన అధికారులు



అటవీ శాఖ సిబ్బందితో వాదనకు దిగుతున్న మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి

కాగజ్‌నగర్, జనవరి 11: దరిగాం అటవీ ప్రాంతంలో రెండు పులుల మృత్యువాత కేసు పురోగతి కోసం చేస్తున్న ప్రయత్నాలు గిరిజనుల్లో ఆగ్రహాన్ని తెప్పిస్తున్నాయి. వరుసగా రెండు పులులు మృతి చెందటంతో ఈ ఘటనలో బుధవారం రాత్రి అనుమానితులుగా భావిస్తూ పశువుల కాపర్లను అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా కూడా వాంకిడి మండలం రెంగారీట్, సర్కపల్లి గ్రామానికి చెందినవారు. అదుపులోకి తీసుకున్న వెంటనే వారిని ఆసిఫాబాద్‌కు తీసుకెళ్లారు. గురువారం ఉదయం పులులు మృతిచెందిన ఘటన స్థలానికి తీసుకెళ్లి అక్కడ పూర్తిగా సీన్‌రికన్‌స్ట్రక్షన్ చేశారు. ఇదంతా కూడా రహస్యంగా చేశారు.

అటవీ కార్యాలయం ఎదుట ఆదివాసీల ధర్నా..

తమ పిల్లలను అకారణంగా అనుమానం కింద తీసుకొచ్చారని ఆదివాసీ గిరిజనులు గురువారం ఉదయం నుంచి కాగజ్‌నగర్ అటవీశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అటవీఅధికారులు సాయంత్రం వరకు సమాధానం ఇవ్వకుండా కార్యాలయానికి తాళం వేశారు. అనంతరం కొద్దిసేపటికి మీపిల్లలు ఎక్కడున్నారని అటవీశాఖ అధికారులు కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. దీంతో కంగారు పడిన ఆదివాసీలు మా పిల్లల్ని విచారణ పేరుతో తీసుకొచ్చి అటవీశాఖ అధికారులు చంపేశారని తీవ్రంగా మండిపడ్డారు. తమ పిల్లను వెంటనే వదిలేయాలని మూడు గంటలపాటు ధర్నాకు చేపట్టారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి మాట్లాడుతూ పులుల మృత్యువాత కేసులో అనుమానిత గిరిజన యువకులను అటవీశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా చితకబాదినట్టు పేర్కొన్నారు. ఈ విషయంలో అన్యాయం జరిగితే రాష్ట్రస్థాయిలో ఉద్యమబాట పడుతామని హెచ్చరించారు. సంఘటన స్థలానికి ఎస్సైలు శ్రీకాంత్, అంజయ్య చేరుకుని ధర్నా చేస్తున్న వారిని సముదాయించారు. అయినా కూడా గిరిజనులు వినలేదు. అటవీశాఖ అధికారులు రావాలని డిమాండ్ చేసినా ఒక్కరు అధికారి కూడా రాలేదు. దీంతో స్వయంగా ఎస్సైలే అటవీశాఖ కార్యాలయంలోకి వెళ్లారు. చివరికి అనుమానంతో తీసుకెళ్లిన పశువుల కాపారులను విడిచి పెట్టారు.

గెలుపే లక్ష్యంగా ఆడాలి: ఎమ్మెల్యే కోవ లక్ష్మి



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జనవరి 11: క్రీడలలో ఓడినప్రతిసారి గెలుపేలక్ష్యంగా ఆడాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో మూడురోజులుగా నిర్వహించిన ఎంపీపీ కప్ సెషన్-3 క్రీడలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడుసంవత్సరాలుగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్న ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అభినందనీయులని అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలన్నారు. ఎంపీపీ మల్లికార్జున్ మాట్లాడుతూ జిల్లా నుంచి క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీలలో పాల్గొనాలని అన్నారు. క్రీడా పోటీలు విజయవంతం కావడానికి సహకరించిన పీఈటీ, పీడీలకు కృతజ్ఞలు తెలిపారు. కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఉపాధ్యాయులు ఊశన్న, జడ్పీటీసీ అరిగెలనాగేశ్వర్‌రావు, సహకారసంఘం చైర్మన్‌అలీబిన్ అహ్మద్, అదనపుకలెక్టర్ వేణు, డీఈవో అశోక్, ఎంఈవో మను కుమార్, ఆర్డీవో గంధం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ



కెరమెరిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కెరమెరి, జనవరి 11: మండలంలోని గోయగాంలో గురువారం అయోధ్య పూజిత అక్షింతలను గ్రామంలోని అంజనేయ ఆలయం నుంచి భారీ ర్యాలీగా వెళ్లి ఇంటింటికి అక్షింతలుఅందజేశారు. మహిళలుదారిపొడవునా పూర్ణకుంభాలు, మంగళహారతులతో స్వాగతంపలికారు. కార్యక్రమంలో గ్రామస్థులు శంకర్, పోశెట్టి,బాపూజీ,పాండురంగ్,సోనాజీ, మహారాజ్‌పాల్గొన్నారు.

కెరమెరి తహసీల్దార్‌గా మునావర్‌షరీఫ్

కెరమెరి, జనవవరి 11: కెరమెరి తహసీల్దార్‌గా గురువారం మునావర్ షరీఫ్ పదవీబాధ్యతలు స్వీకరించారు. ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తూ కెరమెరి తహసీల్దార్‌గా బదిలీపైవచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో భూముల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ఆదివాసీసంఘాల నాయకులు జగన్నాథ్‌రావు, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, జనవరి 11: జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల 2024-25 విద్యా సంవత్సరానికి 6నుంచి 10వ తరగతిలో ప్రవేశకోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. దరఖాస్తు చేయడానికి సమీప మీసేవ కేంద్రాల్లో లేదా ఆన్‌లైన్ కేంద్రాల్లో ఫిబ్రవరి 22లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో 100సీట్లు, 7నుంచి 10వ తరగతిలో ఖాళీగాఉన్నట్లు సీట్లకు ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాంకేతిక విద్యాసంస్థలు ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్, జనవరి 11: జిల్లాలో సాంకేతిక విద్యాసంస్థలను ఏర్పాటుచేయాలని ఐఎన్‌టీయూసీ నాయకులు గురువారం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సాంకేతిక విద్యాసంస్థలు లేకపోవడంతో అనేకమంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. ఆర్థికంగా ఉన్న విద్యార్థులు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లి చదువుకొని లక్షలు ఖర్చు చేస్తున్నారన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నికల్, అగ్రికల్చర్ డిప్లమా కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ముంజబిల్, ప్రీకాంత్, రషీద్ తదితరులు ఉన్నారు.


బీజేపీలో చేరిన కోట్నాక విజయ్‌కుమార్

ఆసిఫాబాద్, జనవరి 11: బీజేపీ మాజీ జిల్లా ప్రధానకార్యదర్శి కోట్నాక విజయ్‌కుమార్ గురువారం తిరిగి బీజేపీలో చేరారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో ఆయన సొంతగూటికి చేరారు. బీజేపీలో గత నాలుగున్నర సంవత్సరాలుగా సేవలు అందించి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో తనకు పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి 16వేలకు పైగా ఓట్లు సాధించాడు.

విద్యతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

వాంకిడి, జనవరి 11: విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలని వైద్యాధికారి వినయ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బేటీ బచావో- బేటీ పడావో రెండో రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌వో రవిదాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డార్ఫ్ దంపతుల సేవలు మరువలేనివి



డార్ఫ్‌దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావ్

జైనూర్, జనవరి 11: ఉమ్మడిఆదిలాబాద్ జిల్లా ఆదివాసులకు మానవ పరిణామశాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ దంపతుల సేవలు మరువలేనివని జిల్లా అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. మండలంలోని మార్లవాయిలో గురువారం నిర్వహించిన హైమన్‌డార్ఫ్, ఆయన సతిమణి బెట్టి ఎలిజబెత్ 37వవర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు పద్మశ్రీ కనక రాజు, ఏపీవో ఆత్రం భాస్కర్, ఎంపీపీ కుంర తిరుమల, సర్పంచ్ కనక ప్రతిభ తదితరులు డార్ఫ్ దంపతుల విగ్రహాలు, సమాధులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపుకలెక్టర్ దీపక్‌తివారి మాట్లాడుతూ ఎక్కడో పుట్టిపెరిగిన డార్ఫ్ దంపతులు ఆదిలాబాద్ జిల్లాలోని మార్లావాయిలో స్థిరనివాసం ఏర్పరచుకుని ఆదివాసులకు చేదోడు వాదోడుగా నిలిచారన్నారు. అదేవిధంగా హైమన్ డార్ఫ్ దంపతులను ఆదర్శంగా తీసుకుని ఆదివాసులకు అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డార్ఫ్ దంపతు లకు ఆదివాసుల సంస్కృతీ సాంప్రదాయం ప్రకారం నివాళులు అర్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

● మార్లవాయి అభివృద్ధికి కృషి - ఎంపీ సోయం బాపూరావు

మార్లవాయిని అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. మండలంలోని మార్లవాయిలో గురువారం నిర్వహించిన 37వ హైమన్ డార్ఫ్ వర్థంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మార్లవాయిలో నివాసం ఏర్పరచుకున్న హైమన్ డార్ఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ ఆదివాసులకు మాతృ మూర్తులన్నారు. ఆదివాసులు వారిని గుండెల్లో దాచి పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు.

నివాళులర్పించిన మంత్రి సీతక్క.

కాగా ప్రొఫెసర్ హైహన్‌డార్ఫ్, ఆయన సతీమణి బెట్టి ఎలిజి బెత్‌కు స్త్రీ శిశు సంక్షేమశాఖ, పంచాయత్‌రాజ్‌శాఖ మంత్రి సీతక్క ఒకరోజు ముందుగానే బుధవారం రాత్రి నివాళులర్పించారు. ఆమెతో పాటు ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెడ్మ బొజ్జు, కలెక్టర్ హేమంత్ బోర్కడే తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క రూ.18 లక్షలతో నిర్మించిన డార్ఫ్ నివాసగృహం, రూ.12లక్షలతో నిర్మించిన స్మృతివనాలను ప్రారంభించారు. జిల్లాలో పని చేస్తున్న అధికారులు డార్ఫ్ దంపతుల మాదిరిగా ఆదివాసులకు సేవలందించినప్పుడు వారిని సైతం ఆదివాసులు అమితంగా ఆదరిస్తారని అన్నారు.

హైమన్‌డార్ఫ్ వర్ధంతి

కాసిపేట: ఆదివాసీల ఆత్మబంధువు, మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హేమన్‌డార్ఫ్ వర్ధంతిని గురువారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో దేవాపూర్‌లో నిర్వహించారు. నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్ముల బాపు మాట్లాడుతూ ఆస్ట్రేలియా దేశం నుంచి ఆదిలాబాద్‌కు వచ్చి ఆదివాసీల జీవన విధానం సంస్కృతి, సంప్రదాయాలపై అధ్యయనం చేశారన్నారు. భూమి, అడవి, నీరుపై పూర్తి అధికారాలు ఆదివాసీలకే దక్కాలని నిజాం సర్కారుకు నివేదికను అందజేశార న్నారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కొమ్ముల రజీత, నవీన, కొమ్ముల సంజీవ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ధరలతో దడ దడ

పెరుగుతున్న కూరగాయల ధరలు

కొనలేని స్థితిలో సామాన్యుడు



కాగజ్‌నగర్ టౌన్, జనవరి 11: వర్షాభావ పరిస్థితులే కాకుండా పండుగలు, ఇతర సమస్యలతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రోజు రోజుకి కూరగాయలు ధరలు పెరుగుతుండడంతో సామాన్యుడికి ఇబ్బందిగా మారింది. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనాలంటే ధరలతో దడ పుడుతోంది. నెల రోజులుగా కూరగాయల రేట్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మార్గశిర మాసం, పండుగల వేళ కావడంతో పాటు వాతావారణ పరిస్థితుల వలన కూరగాయలకు చీడ, పీడలతో నష్టం వల్లనే ఈ పరిస్థితి ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. దీంతో కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఆకుకూరలు, కూరగాయలు ఏవి చూసినా కొనలేని పరిస్థితి ఉందని వినియోగదారులు పేర్కొంటున్నారు. కేవలం ఆలుగడ్డ, టమాట, ఉల్లిగడ్డలు మాత్రమే కేవలం రూ.30రూపాయలకు కిలో వస్తున్నాయి. మిగిలిన ఏ కూరగాయలు చూసినా కూడా రూ.100నుంచి 120పలుకుతున్నాయి.

కిలో కూరగాయలు రూ.100పైనే

కూరగాయలు ఏది కొనాలన్నా కిలోకు రూ.100 పైగానే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా రూ.100-150 లేనిదే కూరగాయలు కొనలేని పరిస్థితి. ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్యుడికి కూరగాయలు అందుబాటులో లేకుండా పోయాయి. కూరగాయల కొనుగోలు చేయలేక పేద, మధ్య తరగతి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.


మార్చి, ఏప్రిల్ నెలలోనే ధరల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశాలుంటాయి. కానీ ప్రస్తుతం చలికాలం సీజన్‌లోనూ ధరల బెడద తప్పడం లేదని, ఇప్పుడే ఈవిధంగా ఉంటే రానున్న వేసవిలో ఇంకా పరిస్థితి ఏవిధంగా ఉంటుందోననే వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కేవలం ఆలుగడ్డ, టమాట తప్ప సామాన్యుడికి అందుబాటులో ఏ కూరగాయలు మార్కెట్‌లో లభించే పరిస్థితి లేదు. ముందుముందు ధరలు మరింత పెరిగే పరిస్థితి ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం షష్టి బోనాలు, అయ్యప్పస్వాముల మాల ధారణ, సంక్రాంతి పండుగ తదితర కార్యక్రమాల్లో భాగంగా కూరగాయల వినియోగం ఎక్కువగా ఉంటోంది. దీంతో వ్యాపారులు ధరలను అమాంతం పెంచి అమ్మకాలు కొనసాగిస్తున్నారు.

తప్పని దళారుల బెడద

కాగజ్‌నగర్ మండలంతోపాటు కాగజ్‌నగర్‌లో కూరగాయల ధరలు చుక్కలంటుతున్నాయి. అలాగే చుట్టుపక్కల మండలాల్లోనూ ధరలు అధి కంగా పలుకుతున్నాయి. ఇక్కడ పండిన కూరగాయల ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుండడంతో స్థానికంగా ధరలు మండిపోతున్నాయి.

దీనికి తోడు ధరలు అమాంతగా పెంచి అమ్మకాలు సాగిస్తున్నారు. స్థానికంగా కొంత మంది వ్యాపారులు సిండికేట్‌గా మారి కూరగాయలు హోల్‌సేల్ ధరలు పెంచేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే కూరగాయలను రైతుల నుంచి ఇష్టారాజ్యంగా దళారుల కొనుగోలు చేసి ధరలు పెంచేస్తున్నారు. దీంతో చిరు వ్యాపారులు ఎక్కువ ధరలకు అమ్మాల్సి వస్తోందని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్, బెంగూళూరు, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల నుంచి ప్రతీనిత్యం కూరగాయలు, ఇతర సరుకులైన ఉల్లి, వెల్లుల్లి, ఆలుగడ్డ, టమాట తదితర సరుకులు దిగుమతి చేసుకుంటున్నారు. మరోపక్క దళారుల దందా కూడా కూరగాయల ధరలపై ప్రభావం చూపుతోందని వినియోగదారులు వాపోతున్నారు.

కాగజ్‌నగర్ మార్కెట్‌లో కూరగాయ ధరలు కిలోకి రూ.	
వంకాయ	80
బీరకాయ	80
దొండకాయ	50
ఆలుగడ్డ	30
క్యారెట్	120
పచ్చిమిర్చి	120
కాకరకాయ	80
బెండకాయ	80
క్యాబేజీ	80
గోరు చిక్కుడు	70
క్యాలీ ఫ్లవర్	80
పాలకూర	120
తోటకూర	100
టమాట	30
ఉల్లిగడ్డ	30



సామాన్యులపైనే అధిక భారం..

కూరగాయల ధరలు అమాంతం పెరిగిపోతుండడంతో సామాన్యుడిపై ఆర్థికంగా భారంగా పడుతోంది. జిల్లాలోని సామాన్య, నిరుపేద ప్రజలు కూరగాయల కొనుగోలు చేసేందుకు జంకుతున్నారు. ప్రతీరోజు ఒక్కో కుటుంబానికి కనీసం కిలో కూరగాయలు అవసరం కాగా, వాటి కోసం రూ.100పైగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. కూరగాయలతోపాటు ఇతర నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఎక్కువగానే ఉండడంతో సామాన్యుడి కుటుంబపోషణ భారంగా మారింది. ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు.

విద్యార్థులకు ముగ్గులు, పతంగుల పోటీలు

ఆసిఫాబాద్, జనవరి 11: మండలంలోని బూర్గుడ ఉన్నతపాఠశాలలో గురువారం సంక్రాంతి పురస్కరించుకుని విద్యార్థులకు ముగ్గుల, పతంగుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన బాలికలకు, పతంగుల పోటీల్లో గెలుపొందిన బాలురకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదాశివ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండలకేంద్రంలోని జడ్పీఎస్ఎస్‌పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పోసాల అక్షిత-ప్రథమ, ఆదెమానస-ద్వితీయ, నికాడి శ్రీజ-తృతీయ బహుమతి గెలుపొందగా విజేతలకు ఎంపీటీసీ పర్వీన్‌సుల్తానా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జావీద్, ఉపాధ్యాయులు శ్రీనాథ్, రవికు మార్, శ్రీనివాజ్, జమీల్, యాకూబ్, ఆశజ్యోతి పాల్గొన్నారు.

సిర్పూర్(యు): మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు పోటీలు నిర్వహించగా మొదటి బహుమతి అనురాధ, రెండవ బహుమతి సుమంతా, మూడవ బహుమతి అంజలి గెలుపొందారు.

తెలంగాణ ప్రభుత్వం

పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ

జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ కార్యాలయము, పిఐయు

కొమురం భీం అసిఫాబాద్ జిల్లా

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లెటర్ నం. 2057/For.I(1)/2021, తేది: 22.06.2021 ప్రకారం రీజినల్ ఆఫీసర్, సెంట్రల్, భారత ప్రభుత్వం, పర్యావరణ మంత్రిత్వ శాఖ, అడవులు & వాతావరణ మార్పు , ఇంటిగ్రేటెడ్ రీజినల్ ఆఫీస్, అరణ్య భవన్, ఆర్‌బిఐ ఎదురుగా, సైఫాబాద్, హైదరాబాద్, తెలంగాణ వారు వారి ఫైల్ నం. 4-TSB196/2021-HYD/ తేది: 19.07.2021 ద్వారా దిగువ నిబంధనలకు లోబడి కె.బి. అసిఫాబాద్ జిల్లా, పిఐయు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ పేరున పిఎంజిఎస్‌వై గ్రాంట్ క్రింద కొమురం భీం అసిఫాబాద్ జిల్లా, కాగజ్ నగర్ డివిజన్‌లో గూడెం ఆర్ఎఫ్‌లో బెజ్జూరు మండలంలో కేతిని నుండి దిందా వరకు రోడ్‌పై 1/100 కిమీ వద్ద హైలెవెల్ బ్రిడ్జ్ నిర్మాణం కొరకు అటవీ భూమి 0.416 హెక్టార్ల మళ్లింపు కొరకు అటవీ (సంరక్షణ) చట్టం 1980 లోని సెక్షన్ 2 క్రింద స్టేజ్-I ఆమోదాన్ని జారీ చేసింది.

i) మళ్లింపబడిన అటవీ భూమి యొక్క న్యాయపరమైన స్థితి మార్చబడకూడదు.
ii) యూజర్ ఏజెన్సీ వ్యయానికి 20 మీటర్ల మధ్యలో తగువిధంగా సంఖ్యలు వేసి 4 అడుగుల ఎత్తైన సిమెంట్ కాంక్రీట్ పిల్లర్లు స్థాపించుట ద్వారా ప్రతిపాదిత అటవీ ఏరియాలో రాష్ట్ర అటవీ శాఖ గుర్తులు పెట్టవలెను.
iii) రాష్ట్ర అటవీ శాఖ చైన్ లింక్ ఫెన్సింగ్, సరిహద్దు స్థంబాలు మరియు ఎస్ఎమ్‌సి పనులు అనగా ఎస్‌సిటీలు మొదలైనవి ఏర్పాటు చేయడం మరియు సిఎ పథకంలో ప్రతిపాదించిన విధంగా సాంస్కృతిక కార్యకలాపాలు మరియు అగ్ని మాపక నిర్వహణ పనులు చేపట్టడం వంటి కార్యకలాపాలు యూజర్ ఏజెన్సీ ఖర్చుతో నిర్వహిస్తుంది.59.468 హెక్టార్లలో 1.00 హెక్టార్ల విస్తీర్ణం పంచాయతీ రాజ్ శాఖ, పిఎంజిఎస్‌వై పథకం క్రింద వివిధ రోడ్ ప్రతిపాదనలకు బదులుగా ఆదిలాబాద్ డివిజన్‌లో ఉన్నట్టి ఆదిలాబాద్ రేంజ్ తంసి మండలం, గిర్గావ్ గ్రామంలోని సర్వే నం. 86లోని అటవీ భూమి కానిది గుర్తించబడినది.
iv) డీగ్రేడెడ్ అటవీ ప్రాంతంలో ప్రతిపాదిత పరిహార అటవీప్రాంతం నిర్వహించుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించినది, రాష్ట్ర అటవీ శాఖ పరిహార అటవీ ప్రాంతం అనగా 50.00 హెక్టార్ల విస్తీర్ణమునకు హెక్టారుకు 1111 (వివిధ పిఎంజిఎస్‌వై రోడ్ ప్రతిపాదనలు కొరకు గుర్తించబడినవి) మావల ఆర్ఎఫ్‌లో ఉన్నట్టి ఆదిలాబాద్ డివిజన్‌లో ఆదిలాబాద్ రేంజ్ ఆదిలాబాద్ సెక్షన్ ఆదిలాబాద్ యొక్క బీట్ compt No.248 & ఆదిలాబాద్ సెక్షన్‌లో మావల బీట్‌లో compt 243 లో డీగ్రేడెడ్ అటవీ భూమిలో ఉన్నాయి.
v) కేంద్ర ప్రభుత్వ ముందస్తు ఆమోదం లేకుండా సిఎ ఉద్దేశ్యం మరియు సిఎ పథకం కొరకు గుర్తించబడిన డీగ్రేడెడ్ అటవీ భూమి మరియు అటవీ ప్రాంతం కానిదానిని మార్చరాదు.
vi) పంచాయతీ రాజ్ శాఖలోని పిఎంజిఎస్‌వై పథకం క్రింద వివిధ రోడ్ల ప్రతిపాదనల స్థానంలో ఆదిలాబాద్ డివిజన్‌లో ఉన్నట్టి ఆదిలాబాద్ రేంజ్‌లో తంసి మండలం లోని గిర్గావ్ గ్రామంలోని సర్వే నం.86లోని గుర్తించబడినట్టి 59.468 హెక్టార్ల విస్తీర్ణంపై పరిహార అటవీ ప్రాంతం పెంచుటకు గుర్తించబడినట్టి మొత్తం అడవులు కాని భూములు రాష్ట్ర అటవీ శాఖ పేరున బదిలీ చేయబడినవి మరియు సంక్రమించబడినవి మరియు అవి స్టేజ్ 2 ఆమోదానికి ముందు స్థానిక అటవీ చట్టం లోని సంబంధిత సెక్షన్ల క్రింద లేదా భారతీయ అటవీ చట్టం 1927 లోని సెక్షన్ 29 క్రింద రక్షిత అటవీప్రాంతం లేదా సెక్షన్ 4 క్రింద రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌గా ప్రకటించబడినవి. ఒరిజినల్ నోటిఫికేషన్‌కు సంబంధించిన ఒక కాపీ సమాచారం మరియు రికార్డు కొరకు ఈ కార్యాలయానికి అమలు నివేదికతోపాటు దాఖలు చేయవలెను.
vii) తెలంగాణ రాష్ట్రంలోని నోడల్ ఆఫీసర్ (ఎఫ్‌సిఏ) మరియు పిసిసిఎఫ్ ప్రతిపాదన ప్రకారం దీని సంపూర్ణత్వానికి సిఏ పథకం అమలుకు ఫీల్డ్ లెవల్ ఆఫీసర్లు అందరికీ సూచనలు ఇవ్వవలసి ఉంటుంది మరియు ఎటువంటి సిఏ మొత్తం వ్యయం చేయకుండా ఉండరాదు.
viii) రిట్ పిటిషన్ (సివిల్) నం.202/1995 లో సంబంధిత ఐఏలతో ఐఏ నం.లు 826 ఇన్ 566లో గౌరవనీయ సర్వోన్నత న్యాయస్థానం తేది 28.03.2008 మరియు 09.05.2008 ఉత్తర్వుల ప్రకారం యూజర్ ఏజెన్సీ నుండి 0.416 హెక్టార్ల కొలత కలిగిన మళ్లింపబడిన అటవీ భూమిలోని ప్రస్తుత నికర విలువ రాష్ట్ర ప్రభుత్వం చార్జ్ చేస్తుంది.
ix) మళ్లింపు చేయబడిన అటవీ భూమిలోని ప్రస్తుత నికర విలువ (ఎన్‌పివి) అదనపు మొత్తం ఏదైనా ఉంటే భవిష్యత్‌లో భారత సర్వోన్నత న్యాయస్థానం ద్వారా దానిని మార్పు చేసిన తర్వాత బకాయిగా ఉంటుంది, యూజర్ ఏజెన్సీ నుండి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సదరు మొత్తం చార్జ్ చేయబడుతుంది.ఇందుకు సంబంధించి పత్రాలను యూజర్ ఏజెన్సీ దాఖలు చేయవలసి ఉంటుంది.
x) ప్రాజెక్ట్ క్రింద యూజర్ ఏజెన్సీ నుండి స్వీకరించబడిన అన్ని నిధులు ఇ-పోర్టల్ (https://parivesh.nic.in/)) ద్వారా మాత్రమే సిఏఎంపిఏ నిధులకు బదిలీ చేయబడతాయి/డిపాజిట్ చేయబడతాయి.
xi) ప్రాజెక్ట్ క్రింద సిఏ, ఎన్‌పివి, మిటిగేషన్ ప్లాన్ వగైరా నిమిత్తం వ్యయాల వంటి అన్ని సుంకాలు ఎస్‌సి-ఎన్‌బిడబ్ల్యూఎల్ నుండి అనుమతి పొందిన తర్వాత మాత్రమే వసూలు చేయబడతాయి.
xii) సమర్థ ప్రాధికారి అనగా ఎస్‌సి-ఎన్‌బిడబ్ల్యూఎల్ నుండి ఆమోదం పొందకుండా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పని అనుమతి పొందబడదు.
xiii) ఎస్‌సి-ఎన్‌బిడబ్ల్యూఎల్ ద్వారా విధించబడిన అన్ని నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వం/యూజర్ ఏజెన్సీ పాటించవలసి ఉంటుంది.
xiv) ఒకవేళ SC NBWL సబ్జెక్ట్ ప్రతిపాదనను సిఫారసు చేయనిచో అప్పుడు స్టేజ్ 1 ఆమోదం ఎఫ్‌సిఏ 1980 క్రింద ఉన్న ప్రకారం ఆటోమేటిక్‌గా రద్దు చేయబడుతుంది.
xv) దాని సమావేశం తేది 07.07.2021 లో ఆర్‌ఇసి ఆదేశం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం WII వగైరా వంటి జంతుజీవ పరిరక్షణ రంగంలోని నిపుణులను సంప్రదించాల్సి ఉంటుంది మరియు కవాల్ టైగర్ రిజర్వ్ ఏరియాల ప్రాంతాలతోపాటు రోడ్ స్థాయి పెంపుదల (మళ్లింపు కొరకు ప్రతిపాదించబడినట్టి వివిధ స్ట్రెచ్‌లలో మొత్తం రోడ్ల సంఖ్య) మొత్తం మీద ప్రభావాన్ని పరిశీలిస్తూ సవరించబడినట్టి సమగ్ర మిటిగేషన్ ప్లాన్‌ను సిద్ధపరచవలెను మరియు రాష్ట్ర అటవీ శాఖ యూజర్ ఏజెన్సీ వ్యయానికి సదరు ప్రణాళికను ప్రణాళికాబద్ధంగా అమలుపరుస్తుంది. సవరించబడినట్టి సమగ్ర మిటిగేషన్ ప్లాన్ అంచనా కొరకు ఎస్‌సి-ఎన్‌బిడబ్ల్యూఎల్‌కు దాఖలు చేయవలెను.
xvi) క్ర.సం.(xv) సిద్ధపరచబడే సమగ్ర జంతుజీవన మిటిగేషన్ ప్లాన్ ప్రకారం యూజర్ ఏజెన్సీ వ్యయానికి MoEF మరియు WII మార్గదర్శకాల ప్రకారం తగిన నిర్దేశకాలతో జంతు మార్గాల అవసరమైన సంఖ్య నిర్మించబడుతుంది.
xvii) ప్రాజెక్ట్ వ్యయానికి సంబంధిత డీఎఫ్‌వోను సంప్రదించుట ద్వారా అవసరమైన చోట చెక్ వాల్స్ మరియు రిటెయినింగ్ వాల్స్‌ను యూజర్ ఏజెన్సీ నిర్మించవలసి ఉంటుంది.
xviii) కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆదిలాబాద్ ద్వారా సిఫారసు చేయబడిన విధంగా దిగువ నిబంధనలను యూజర్ ఏజెన్సీ అమలు చేయవలసి ఉంటుంది. అవి ఎ) అండర్ పాసెస్ నిర్మాణం స్థలంలో చెత్త మొత్తాన్ని నిర్మాణం తర్వాత వెంటనే తొలగించవలెను. బి.సురక్షితమైన జంతుజీవనం కొరకు ఇసుక/సిల్ట్ ప్రోగును నివారించుటకు 04 నెలలలో ఒకసారి త్రవ్విపోయుట చేయవలసి ఉంటుంది మరియు వాగుల మీదుగా కల్వర్టులను నిర్వహించాల్సి ఉంటుంది. సి. ఎటువంటి అగ్నిని అడవిలో వెలిగించరాదు. డి) స్థాయి పెంపుదల పనిని ఉ.9 గం. నుండి సా.4 గం.మధ్యన మాత్రమే చేయవలసి ఉంటుంది. ఇ. వైల్డ్ లైఫ్ మిటిగేషన్ ప్లాన్‌లో ప్రతిపాదించబడిన విధంగా జంతుజీవన మిటిగేషన్ ప్రమాణాలు ఏర్పాటు చేయబడి ఉండవలెను.
ix) వంతెన నిర్మాణం నీటి సహజ స్థితిని మార్పు చేయకుండా ఎటువంటి నీటి ప్రవాహాలు జరగకుండా మరియు జంతుజీవన స్రవంతికి ఎటువంటి అపాయం కలగని విధానంలో జరగవలెను.
xx) మృత్తికా ప్రమాణీకరించు విధంగా సంబంధిత డిఎఫ్‌వో సూచనల ప్రకారం అవసరమైన ఇంజనీరింగ్ మద్దతును రోడ్ సైడ్ కటింగ్స్ మరియు ఫిల్లింగ్స్‌కు ఏర్పాటు చేయవలసి ఉంటుంది.
xxi) అటవీ ప్రాంతం వెలుపల త్రవ్విన మెటీరియల్/అదనపు వృధా చెత్తను వేయవలెను. అటవీ ప్రాంతంలో ఎటువంటి చెత్త నిల్వలు ఉంచరాదు.
xxii) ప్రతిపాదన లేఅవుట్ ప్లాన్ కేంద్ర ప్రభుత్వ ముందస్తు ఆమోదం లేకుండా మార్చబడదు.
xxiii) యూజర్ ఏజెన్సీ నష్టాన్ని/చెట్లు పడగొట్టుటను నివారించుటకు సైట్ వద్ద పని చేస్తున్న కూలీలకు ప్రత్యామ్నాయ ఇంధనంగా కలపను అందించవలెను మరియు ఎటువంటి లేబర్ క్యాంపులు అటవీ ప్రాంతం లోపల నెలకొల్పరాదు.
xxiv) ఎంత వీలు అవుతుందో అంత దూరం అటవీ ప్రాంతం వెలుపల లేబర్ క్యాంపులు ఏర్పాటు చేయట ద్వారా అంతరాయాన్ని కనీసం కొంతలో కొంత తగ్గించుకొనవచ్చును మరియు అటవీ జంతు జీవ స్రవంతికి సమీపంలో పనులు చేసి అంతరాయం కలిగించకుండా మరియు పని నిర్వహణలో ఉన్నట్టి కూలీలు మరియు సిబ్బంది ఆవిధంగా చేయకుండా చూసుకొనుట యూజర్ ఏజెన్సీ బాధ్యతగా ఉంటుంది.
xxv) ప్రాజెక్ట్ కొరకు వినియోగించబడినట్టి మొత్తం అటవీ ప్రాంతం 0.416 హెక్టార్లకు మించి ఉండరాదు మరియు మళ్లించబడినట్టి అటవీ ప్రాంతం మళ్లింపు ప్రతిపాదనలో చూపిన విధంగా కాకుండా ఏదేని ఇతర ఉద్దేశ్యాలకు వినియోగించరాదు. ఇందుకు సంబంధించి యూజర్ ఏజెన్సీ నిర్వహణను దాఖలు చేయవలసి ఉంటుంది.
xxvi) ప్రాజెక్ట్ పని నిర్వహణ కొరకు నిర్మాణ సామగ్రి రవాణా కొరకు అటవీ ప్రాంతం లోపల ఎటువంటి అదనపు లేదా నూతన దారులు నిర్మించరాదు.
xxvii) మళ్లింపు కొరకు ప్రతిపాదించబడినట్టి అటవీ భూమి ఎటువంటి పరిస్థితులలో బదిలీ చేయబడదు లేదా ఏదేని ఇతర ఏజెన్సీ, శాఖ లేదా వ్యక్తికి కేంద్ర ప్రభుత్వ ఆమోదం లేకుండా అప్పగించబడదు.
xxviii) ప్రాజెక్టుకు వర్తించు విధంగా సదరు కాలంలో అమలులో ఉన్నట్టి అన్ని చట్టాలు, నియమ నిబంధనలు మరియు మార్గదర్శకాల నిబంధనలను అమలు పరిచే విధంగా యూజర్ ఏజెన్సీ మరియు రాష్ట్ర ప్రభుత్వం రూఢీ పరచుకొనవలసి ఉంటుంది.
xxix) అటవీ ప్రాంతంలో జంతు జీవన స్రవంతి నిర్వహణ మరియు పరిరక్షణ, అటవీ ప్రాంత ప్రయోజనాల విషయంలో కాలాన్ని బట్టి ఏవేని ఇతర నిబంధనలను కేంద్ర ప్రభుత్వం లేదా రీజినల్ ఆఫీసర్ (సెంట్రల్) ఇంటిగ్రేటెడ్ రీజినల్ ఆఫీస్, హైదరాబాద్ వారు విధించవచ్చును. వాటిని యూజర్ ఏజెన్సీ అమలుపరచవలసి ఉంటుంది.
xxx) యూజర్ ఏజెన్సీ పైన తెలిపిన నిబంధనలలో దేనినైనా పాటించుటలో విఫలమైన సందర్భంలో, ఎఫ్‌సిఏ 1980 క్రింద జారీ చేయబడినట్టి మార్గదర్శకాల క్రింద నిబంధనల ప్రకారం జరిమానా చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది.
xxxi) రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ (https://parivesh.nic.in/)) ద్వారా పైన తెలిపిన నిబంధనలపై అమలు నివేదిక దాఖలు చేయవలెను మరియు ప్రక్రియ చేపట్టవలెను.

పైన తెలిపిన నిబంధనలపై అమలు నివేదిక స్వీకరించబడిన మీదట, ప్రతిపాదన తుది ఆమోదానికి పరిశీలించబడుతుంది. ఈ ఇన్- ప్రిన్సిపుల్ ఆమోదం ఈ లెటర్ జారీ తేదీ నుండి 5 సంవత్సరాల కాలానికి చెల్లుబాటులో ఉంటుంది. పైన తెలిపిన నిబంధనలు పాటించని సందర్భంలో ఈ ఇన్-ప్రిన్సిపుల్ ఆమోదం 5 సంవత్సరాల తర్వాత ఆటోమేటిక్‌గా రద్దు అవుతుంది.

సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్, పిఐయు,
కొమురం భీమ్ అసిఫాబాద్ జిల్లా

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

వాంకిడి, జనవరి 11: మండల కేంద్రంలోని రాంనగర్ రేషన్ షాప్ డీలర్ అక్రమంగా పీడీఎస్ బియ్యం విక్రయించినందున 6(ఎ) కింద కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్ కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు జూనియర్ అసిస్టెంట్ జమ్నుదాస్‌తో కలిసి గురువారం రేషన్‌షాప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్‌షాపులో స్టాక్‌నిలువలు పరిశీలించగా 39.02క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ విషయంపై డీలర్ వనపర్తి సునీత, ఆమె భర్త భాస్కర్‌ను ప్రశ్నించగా అదే గ్రామానికి చెందిన ముజాహీద్ అలియాజ్ ముజ్జు అనే వ్యక్తికి కిలో రూ.12చొప్పున అమ్మినట్లు తెలిపారు. బియ్యం దుర్వినియోగానికి పాల్పడిన డీలర్ సునీత, ఆమె భర్త భాస్కర్‌తోపాటు అక్రమంగా బియ్యం కొనుగోలు చేసిన వ్యాపారి ముజహిద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే డీలర్‌వద్ద నుంచి 45క్వింటాళ్ల బియ్యం, కాంటా, ఈ-పీవోఎస్ డివైజ్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

బెజ్జూరులో బినామీ రేషన్ డీలర్‌పై..

బెజ్జూరు, జనవరి 11: మండలంలోని చిన్న సిద్దాపూర్ రేషన్ షాపు బినామీ డీలర్‌గా కొనసాగుతున్న సర్పంచ్ రవిపై 6(ఎ) కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపారు. గురువారం రేషన్‌షాపును తనిఖీచేయగా సర్పంచ్ బినామీ డీలర్‌గా వ్యవహరిస్తు న్నట్లు తేలడంతో ఆయనపై కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో భాగంగా 6క్వింటాళ్ల రేషన్ బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. గతంలో కూడా సర్పంచ్ రవిపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. చిన్న సిద్దాపూర్ రేషన్ షాపు ఇన్‌చార్జిగా బెజ్జూరు డీలర్ పురుషోత్తంకు అప్పగించినట్లు తెలిపారు.

పీవీటీజీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, జనవరి 11: పీవీటీజీల అభివృద్ధిపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారిం చాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురు వారం కలెక్టరేట్‌లో పీవీటీజీల అభివృద్ధి, పోషణ్ వాటిక, ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఐసీడీఎస్, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న ప్రధానమంత్రి వర్చువల్ విధానం ద్వారా పీవీటీజీ లబ్ధిదారులతో మాట్లాడే కార్యక్రమం ఉన్నందున సంబంధిత అధికారులు అవసరమైన ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. జిల్లాలో 50అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈనెల 20లోగా పోషణ్ వాటికలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల్లోని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేసే ప్రక్రియను ఈనెల 17లోగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ నెల15న ప్రధాన మంత్రి వర్చువల్ విధానం ద్వారా పీవీటీజీ లబ్ధిదారులతో మాట్లాడే కార్యక్రమం ఉన్నందున కలెక్టరేట్‌లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఇందులో భాగంగా పీవీటీజీ ఆదివాసులు, గిరిజనులందరు ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా కలిగి ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఆయుష్మాన్‌భారత్ ఆరోగ్యకార్డుల పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జనవరి 11: ఎరువుల దుకాణాల వ్యాపారులు నిబంధనలను తప్పకుండా పాటించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుం టామని జిల్లా వ్యవసాయాధికారి ఆర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆయనతనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి వ్యాపారుల గోదాంలలో ఎరువుల నిలువలు, ఈ-పాస్ నిలువలతో సమానంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆధార్ వివరాలు నమోదుచేయకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మకాలు జరపకూడదని వ్యాపారులకు సూచించారు. వ్యవసాయాధికారులు, సహాయవ్యవసాయ సంచాలకులు వారానికి పదిదుకాణాల చొప్పున ఎరువుల నిలువలపై తనిఖీ నిర్వహించాలని ఆదేశించారు. ఆయనవెంట ఏవో ఖాదర్ హుస్సేన్ ఉన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో పది సంవత్సరాల జైలు

ఆసిఫాబాద్/కౌటాల, జనవరి 11: బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి పదిసంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్‌కోర్టు ప్రధానన్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చారు. కౌటాల సీఐ సాదిక్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం.. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో 2018లో జరిగిన అత్యాచారం ఘటనలో రవీంద్రనగర్‌కు చెందిన సత్యజిత్ మండల్(25) అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అప్పటి సీఐలు బిశ్రీనివాస్, బుద్ధస్వామి, డి మోహన్ విచారణ చేశారు. పోలీసుల విచారణ అనంతరం సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేసి సాక్ష్యులను ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాద్ ప్రవేశపెట్టిన సాక్షుల విచారణ అనంతరం కేసు పూర్వపరాలను పరిశీలించిన అనంతరం నిందితుడికి 420, 376, 417 ఐపీసీ సెక్షన్ 4 పోక్సో చట్టం కింద పదిసంవత్సరాల జైలుశిక్ష, రూ.35వేల జరిమానా విధించారు. డిస్ట్రిక్ లైసెనింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఎస్సై కె సాగర్, కాగజ్ నగర్ సబ్‌డివిజనల్ ఆఫీసర్‌గా ఉన్న హెడ్‌కానిస్టేబుల్ బాబాజీ నిందితుడికి శిక్షపడేలా కృషిచేశారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ సురేష్‌కుమార్ అభినందించారు.



ఈఎస్ఐ అమలు ప్రక్రియ ప్రారంభం

శ్రీరాంపూర్, జనవరి 11: కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ అమలు ప్రక్రియ ప్రారంభమైంది. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానకార్యాలయాన్ని ఈఎస్ఐ రీజినల్ డైరెక్టర్ టి ప్రశాంత్, బ్రాంచ్ మేనేర్ సాయి బృందం సందర్శించి కార్మికుల వివరాలు సేకరించింది. సింగరేణి డీజీఎం(పర్సనల్) డి వరప్రసాద్, ఇతర పర్సనల్ అధికారులు వారికి కార్మికుల వివరాలను వెల్లడించారు. ఈ ప్రతినిధి బృందంలో ఎస్‌సీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు, కొత్తగూడెం బ్రాంచ్ కార్యదర్శి డి వీరన్న తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా తమ కృషితోనే కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ అమలు ప్రక్రియ ప్రారంభమైనట్లు కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర ప్రధానకార్యదర్శి బి మధు పేర్కొన్నారు.

సింగరేణి రిటైర్డ్ కార్మికుల మొర ఆలకించండి

మందమర్రి టౌన్, జనవరి 11: సింగరేణిలో మూడు నుంచి నాలుగు దశాబ్దాల పాటు పనిచేసి రిటైరైన కార్మికుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని రిటైర్డ్ కార్మికసంఘం నాయకులు వాసాల శంకర్, రేణికుంట్ల కొమురయ్య, రాంరవిందర్ పేర్కొన్నారు. గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద విలేకరులతో మాట్లాడుతూ తాము రిటైరై నెలలు గడుస్తున్నా ఇంకా బకాయిలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రధానంగా వేజ్‌బోర్డు బకాయిలు, లాభాల వాటా, లాభాల బోనస్, గ్రాట్యుటీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రిటైర్డ్ కార్మికసంఘానికి ఒక క్వార్టర్ కేటాయించాలని త్వరలోనే జీఎంను కోరుతామని తెలిపారు. సకాలంలో పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసరి ఎల్లారం, వీరన్న, పోలు సంపత్ పాల్గొన్నారు.

పదోన్నతులతో అదనపు ప్రయోజనాలు



ఉత్తర్వులు అందజేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జనవరి 11: పదోన్నతులతో ఉద్యోగులకు అదనపుప్రయోజనాలు కలిగి వేతనాలు పెరుగుతాయని శ్రీరాంపూర్ జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. గురువారం జీఎం కార్యాలయంతోపాటు వివిధ గనులు, విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎస్ఎల్‌పీ ప్రమోషన్ పత్రాలను అందజేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ, ఏరియాలో 342మంది ఉద్యోగులు పదోన్నతులకు అర్హత కలిగి ఉన్నారని, వారికి పదోన్నతి పత్రాలను అందించామన్నారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే6 గనిపై ఎస్ఎల్‌పి పదోన్నతి పత్రాలను మేనేజర్ ఈ తిరుపతి ఉద్యోగులకు పదోన్నతి పత్రాలను అందజేశారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

సింగరేణి ఆధ్వర్యంలో ముద్రించి నూతన సంవత్సర క్యాలెండర్‌ను జీఎం బి సంజీవరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉద్యోగులకు ప్రేరణ కలిగేలా క్యాలెండర్‌ను తయారు చేశామ న్నారు. ఆయా కార్యక్రమాలలో ఎస్‌వోటు జీఎం కె రఘుకుమార్, డీజీఎంలు అరవిందరావు, చిరం జీవులు, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ గనులను ఏర్పాటు చేయాలి

తాండూర్, జనవరి 11: బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా భూగర్భ గనులు ఏర్పాటు చేయాలని, ఏరియా సమస్యలను పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ కార్మికసంఘం ప్రధానకార్యదర్శి జనక్‌ప్రసాద్, బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరంశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ నాయకులు గురువారం సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఏరియాలో ఒక్క భూగర్భ గని లేదని, వెంటనే భూగర్భగని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సింగరేణి డిస్పెన్సరీలో రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

శ్రీరాంపూర్, జనవరి 11: ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై అవగాహన కలిగిఉండాలని ఏరియా వైద్యాధికారి డాక్టర్ లోకనాథ్‌రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీపై గుండెజబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించగా, ఆయనముఖ్యఅతిథిగాహాజరై మాట్లాడారు. సమతులఆహారం తీసుకుంటూ, వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం గుండె జబ్బులు, సిపిఆర్ గురించి అవగాహన కల్పించారు.

ఉచిత వైద్య సౌకర్యం కల్పించండి

శ్రీరాంపూర్, జనవరి 11: సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు అపరిమిత ఉచితవైద్యసౌకర్యం కల్పించాలని సింగరేణివిశ్రాంతఉద్యోగులసంక్షేమ సంఘం అధ్యక్షుడు దండంరాజ్ రాంచందర్, ఉప ప్రధానకార్యదర్శి వేణుమాధవ్, ఉపాధ్యక్షుడు కంచ బీరయ్య కోరారు. గురువారం వారు సీఎండీ ఎన్ బలరామ్‌ను కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సింగరేణ ఆస్పత్రుల్లో సీపీఆర్ ఎంఎస్ మెడికల్ కార్డులో నిమ్స్ టారిఫ్‌లో 40 శాతం కోతవిధించరాదని కోరారు.

పకడ్బందీగా సర్వే మజ్దూర్ అసిస్టెంట్ చైన్‌మెన్ పరీక్ష

మందమర్రి టౌన్, జనవరి 11: ఏరియాలోని జీఎం కార్యాలయంలో గురువారం ఇంటర్నల్ సర్వే మజ్దూర్ అసిస్టెంట్ చైన్‌మెన్ పదోన్నతి రాతపరీక్ష నిర్వహించారు. అసిస్టెంట్ చైన్‌మన్ పోస్టులు 13 ఖాళీలు ఉండగా 22మంది దరఖాస్తు చేసుకోగా 21 మంది హాజరయ్యారు. అదేవిధంగా చైన్‌మెన్ నుంచిహెడ్‌చైన్‌మెన్ పదోన్నతి ఉద్యోగాలకు మొత్తం పోస్టులు 5ఉండగా ఇద్దరుహాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌వోటూ జీఎం మాట్లాడుతూ రాతపరీక్షలు పకడ్బందీగా నిర్వహించామన్నారు. పరీక్షల నిర్వహణలో ఏరియాసర్వే ఆఫీసర్ ఉజ్వల్‌బందోపాధ్యాయ,పీఎం శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధే లక్ష్యం

మందమర్రి టౌన్, జనవరి 11: సింగరేణి సంస్థ అభివృద్ధే లక్ష్యంగా ఉద్యోగులు, అధికారులు అనే తేడా లేకుండా అందరూ అంకితభావంతో పనిచేయాలని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉత్పత్తి లక్ష్యానికి కేవలం మూడు నెలలు మాత్రమే ఉందన్నారు. ఉద్యోగులువిధిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి విషయంలో ముందుండాలన్నారు. అనంతరం 2024క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, విజయప్రసాద్ పాల్గొన్నారు.